క్లుప్తంగా

చెక్‌డ్యామ్ పనులు ప్రారంభించాలి

అడ్డగూడూరు : మండలంలోని ధర్మారం గ్రామ శివారులో చెక్ డ్యామ్ పనులు ప్రారంభించాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ మందుల సామేల్ కోరారు. గురువారం చెక్ డ్యామ్ పనులను పరిశీలించారు. చెక్ డ్యాం నిర్మాణ పనుల వివరాలను అధి కారులు, కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ

బీబీనగర్: మండలంలోని చిన్నరావులపల్లి గ్రామంలో జరుగుతున్న అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులతో పాటు ప్రైమరీ హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణ స్థలాన్ని గురువారం ఎంపీపీ ఎర్కుల సుధాకర్ గౌడ్ పరిశీలించారు. అనంతరం రహీమ్‌ఖాన్‌గూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రణీతాపింగళ్‌రెడ్డి, సర్పంచ్‌లు రవికుమార్, బాలమణిదేవదాసు, ఎంపీటీసీ బాలచందర్, ఉప సర్పంచ్ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భువనగిరి : పట్టణంలోని 11వ వార్డులో జరుగుతున్న శానిటేషన్, అభివృద్ధి పనులను గురువారం మున్సిపల్ చైర్మన్ ఆంజనేయులు పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట కౌన్సిలర్ జిట్టా వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు మోత్కూరు విద్యార్థినుల ఎంపిక



ఎండీ ఆయిషా



బి.అభినయ

మోత్కూరు : ఈ నెల 28, 29, 30 తేదీలలో జరగనున్న సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలకు మోత్కూరు సేక్రెడ్ హార్ట్ పాఠశాలకు చెందిన ఎండీ.ఆయిషా (కబడ్డీ), బి.అభినయ (ఫుట్‌బాల్)లు ఎంపికయ్యారని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ తానయ్య, పీఈటీ ఎస్.యాదయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

మోటకొండూర్ : మండలంలోని అమ్మనబోలు ఉన్నతపాఠశాలకు చెందిన విద్యార్థిని చిట్టిగళ్ల సంధ్య రాష్ట్ర స్థాయి సీఎం క్రీడా పోటీలకు ఎంపికైందని ఆ పాఠశాల పీఈటీ మధు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

రేషన్ డీలర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

బొమ్మలరామారం : రేషన్ డీలర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని రేషన్ డీలర్ల సమాఖ్య మండల అధ్యక్షులు సుర్వీ వెంకటేష్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డీలర్ల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సమాఖ్య నాయకులు రవి, రాజు, ఆంజనేయులు, ప్రకాష్, దశరథ, శివ కుమార్ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

రామన్నపేట: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేస్తామని ప్రకటించడం పట్ల గురువారం పలువురు పంచాయతీ కార్యదర్శులు మండల కేంద్రంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఎంపీపీ కన్నెబోయిన జ్యోతి బలరాం, ఎంపీడీఓ గాదె జలందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్‌లను సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు బాదె చంద్రశేఖర్, శిరీష, స్వరూప, రసూల్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

రాజాపేట : మండల కేంద్రానికి చెందిన చింతం సత్తయ్య ఇటీవల మృతి చెందాడు. గురువారం తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీసెల్ అధ్యక్షుడు ప్రీతం నాగారి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నెమిల మహేందర్ గౌడ్, నర్సింహులు, ఎస్సీసెల్ నాయకులు నరేష్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

చౌటుప్పల్ : మండల పరిధిలోని నేలపట్ల గ్రామానికి చెందిన చప్పిడి మల్లారెడ్డికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ. 57 వేల చెక్కును గురువారం ఎంపీటీసీ తడక పారిజాత అందజేశారు. ఈ కార్యక్రమంలో తడక మోహన్, చప్పిడి భాస్కర్‌రెడ్డి పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుండె పోటుతో కాచరాజు జయప్రకాష్ మృతి

భువనగిరి : భువనగిరి పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త కాచరాజు జయప్రకాష్(70) గురువారం గుండె పోటుతో మృతి చెందారు. సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూఅనేక సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేశారు. ఆయన మృతి పట్ల పట్టణంలోని సీనియర్ సిటీజన్స్, వివిధ వర్గాల ప్రముఖులు సంతాపాన్ని ప్రకటించారు.

వారాంతపు సంతల్లో సమస్యల తిష్ట

- రోడ్లకు ఇరువైపులా కూరగాయలు, పండ్ల విక్రయాలు
- మూత్రశాలలు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు లేక ఇబ్బందులు
- కనీస వసతులు కల్పించాలని వేడుకోలు

సంస్థాన్ నారాయణపురం : మండలంలో వావిళ్లపల్లి గ్రామంలో శనివారం, సంస్థాన్ నారాయణపురంలో శుక్రవారం, సర్వేల్ మంగళవారం, , జనగాం గ్రామంలో గురువారం వారాంతపు సంతలు జరుగుతాయి. ఆయా గ్రామాల్లో నిర్వహించే వారాంతపు సంతల్లో కనీస సౌకర్యాలు లేక ప్రజలు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక్క సర్వేల్‌లో మాత్రమే సంత నిర్వహణకు షెడ్లు ఏర్పాటు చేశారు. సంస్థాన్ నారాయణపురం, జనగాం, వావిళ్లపల్లి సంతలలో వ్యాపారం చేసుకునేందుకు ఎలాంటి షెడ్లు లేకపోవడంతో రోడ్లకు ఇరువైపుల కూరగాయలు, పండ్లు, ఇతర వస్తువులు అమ్ముకునే వ్యాపారులు ఎండకు ఎండతూ, వానకు తడుస్తూ తమ సరుకులు అమ్ముకుంటున్నారు. వర్షాకాలం వస్తే, సరుకులు తడవడంతో పాటు బురదలోనే కూర్చోవాల్సి వస్తుందని సరుకులు కూడా ఎండకు ఎండి, దుమ్ము పట్టి, వర్షం వచ్చినప్పుడు తడిసి నష్టపోవాల్సి వస్తోందని పలువురు వ్యాపారులు వాపోతున్నారు. మూత్రశాలలు, మరుగు దొడ్లు, తాగునీటి సౌకర్యాలు లేకపోవడంతో వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మహిళల పరిస్థితి మరీ దారుణం.



జనగాం సంతలో రోడ్డుకు ఇరువైపులా కూర్చుని కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు



వావిళ్లపల్లిలో..

ఆదాయమున్నా..

వావిళ్లపల్లి సంతలో వ్యాపారం నిర్వహించినందుకు గాను పన్నులు వసూలు చేస్తారు. దీంతో గ్రామ పంచాయతీకి ఆదాయం సమకూరుతుంది. కానీ పంచాయతీ అధికారులు సంతలో ఎటువంటి సౌకర్యాలు కల్పించడం లేదు. ఇక్కడ పశువుల సంతకు స్థలం ఉన్న కూరగాయలు, పండ్లు, ఇతర వస్తువులు అమ్ముకునేందుకు స్థలంలేని కారణంగా రోడ్డుకు ఇరువైపులా వ్యాపారులు కూర్చుని అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అక్కడక్కడ ఆదాయం వస్తున్న వారాంతపు సంతలను అభివృద్ధి చేస్తున్న వావిళ్లపల్లిలో పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. ఆయా సంతలు అసౌకర్యాల మధ్య కొనసాగుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి వారాంతపు సంతల్లో కనీస వసతులు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

కనీస వసతులు కల్పించాలి

సీజనల్‌గా వచ్చే పండ్లను వారాంతపు సంతలో అమ్ముకుంటాను. మండలంలో జరిగే ఏ సంతలో కూడా నీటి, మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ వ్యాపారం చేసుకుంటున్నాం.



– అశమ్మ, పండ్ల వ్యాపారి

ఇబ్బందులు పడుతున్నాం

మండలంలోని నాలుగు సంతలకు వెళ్లి కూరగాయలు అమ్మకం చేస్తుంటాను. సర్వేల్‌లో తప్పించి, మిగతా మూడు సంతలలో ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. వారాంతపు సంతల్లో కనీస వసతులు కల్పించాలని కోరుతున్నాం.



– సుక్క ముత్తమ్మ , కూరగాయల వ్యాపారి

అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి : అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పలువురికి మంజూరైన ఆసరా పింఛన్ ప్రొసిడింగ్ కాపీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోచంపల్లి మున్సిపాలిటీలో కోట్ల రూపాయల నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలంతా అండగా నిలవాలన్నారు. అంతకు ముందు పట్టణ కేంద్రంలోని 11వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్‌చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్, వైస్ చైర్మన్ బాత్క లింగస్వామి, ఎంపీడీఓ బాలశంకర్, ఎంపీఓ మాజిద్, ఏపీసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి, రావుల శేఖర్‌రెడ్డి, పాటి సుధాకర్‌రెడ్డి, చిల్వేరు బాల నర్సింహ, సీత వెంకటేశం, గోరంటి శ్రీనివాస్‌రెడ్డి, ముత్యాల మహిపాల్‌రెడ్డి, చంద్రం, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని పిలాయిపల్లి గ్రామంలో రూ.40లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను గురువారం ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. బీసీ కమ్యూనిటీ భవనానికి రూ.15లక్షలు, ఎస్సీ కమ్యూనిటీ భవనానికి రూ.14లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. పోచంపల్లి, వలిగొండ మండలాల మీదుగా వెళ్తున్న హైవే వల్ల ఇక్కడి భూముల విలువ రెట్టింపుకానుందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాలన్ని ఎంతో అభివృద్ధి చెందుతున్నాయన్నారు.



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

గ్రామానికి చెందిన కాంగ్రెస్, టీడీపీకి చెందిన వార్డు సభ్యులు కొడిసెల మంజుల నర్సింహ, ముద్దగోని బుచ్చయ్య, కొంతం ఈశ్వరయ్యతో పాటు ఆయా పార్టీల నుంచి సుమారు వంద యువకులు, మహిళలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కాగా గ్రామం నుంచి దేశ్‌ముఖి వరకు అసంపూర్తిగా ఉన్న రోడ్డును పూర్తి చేయించాలని, పిలాయిపల్లి కాలువ తూములను నిర్మించాలని, జూలూరు పీఏసీఎస్‌లో దుర్వినియోగమైన నిధులను రికవరీ చేయించాలని కోరుతూ కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ అందెల హరీష్, ఎంపీటీసీ బందారపు సుమలత లక్ష్మణ్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రంగ జ్యోతి విశ్వనాథం, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పాటి సుధాకర్‌రెడ్డి, చంద్రశేఖర్, మహేశ్, మేఘనాథ్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాత వస్తువులను ట్రిపుల్‌ఆర్ కేంద్రాలకు అందజేయాలి

మోత్కూరు : ఇళ్లలో నిరుపయోగంగా ఉన్న పాత వస్తువులను ట్రిపుల్‌ఆర్ కేంద్రాలకు అందజేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తీపిరెడ్డి సావిత్రి అన్నారు. గురువారం 7వ వార్డు పరిధిలో ఏర్పాటు చేసిన ట్రిపుల్ ఆర్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్లల్లో ఉపయోగపడని ప్లాస్టిక్ వస్తువులు, పాత దుస్తులు, పాత పుస్తకాలు, చిన్న పిల్లల వస్తువులను ట్రిపుల్ ఆర్ సెంటర్లలో అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్, కోఆప్షన్ సభ్యుడు గనగాని నర్సింహ్మా, సిబ్బంది శ్రవణ్‌కుమార్, నర్సింహ చారి, కొప్పుల సత్యనారాయణ, మున్సీర్, మున్సిపల్ సిబ్బంది, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ట్రిపుల్‌ఆర్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

బీబీనగర్: మండలంలోని పడమటిసోమారం గ్రామంలో గల శ్రీలింగబస్వేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న ధ్వజస్తంభ, పోచమ్మ, మారెమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపన వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సమితి మండల కోఆర్డినేటర్ బొక్క జైపాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ చైర్మన్ బస్వారెడ్డి, ఈఓ నరేందర్‌రెడ్డి, వీరారెడ్డి, మోహన్‌రెడ్డి, బస్వయ్య, మహిపాల్‌రెడ్డి, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న జెడ్పీ చైర్మన్, తదితరులు

బాధిత కుటుంబాలకు ఆర్థిక చేయూత



వలిగొండ : ఆర్థికసాయం అందజేస్తున్న ముద్దసాని కిరణ్ రెడ్డి

భువనగిరి : మండలంలోని బండసోమారం గ్రామానికి చెందిన నల్లమాసు బాలరాజ్ (43) గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. పీఏసీఎస్ చైర్మన్ మందడి లక్ష్మీనర్సింహ రెడ్డి మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. చందుపట్ల పీఏసీఎస్ డివిడెండ్ ఫండ్ నుంచి మృతుడి కుటుంబానికి రూ. 30 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఎలిమినేటి మల్లారెడ్డి, డైరెక్టర్లు భూర్గు, సౌజన్య, లక్ష్మీ, మల్లారెడ్డి, సిబ్బంది దంతూరి నర్సింహ, నవీన్‌కుమార్ ఉన్నారు.

వలిగొండ : మండలంలోని మొగిలిపాకలో గ్రామ పంచాయతీ కారోబార్ బోలుగుల కుమార్ తండ్రి బోలుగుల నర్సింహ గురువారం మృతి చెందాడు. బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు ముద్దసాని కిరణ్ రెడ్డి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో భిక్షపతి, నరసింహ, మొగిలిపాక రమేష్ ,విష్ణు, సత్య, రాములు పాల్గొన్నారు.

గుండాల : మండలంలోని తుర్కలశాపురం గ్రామానికి చెందిన వంగాల రాములు ఇటీవల మృతి చెందారు. మృతుడి కుటుంబాన్ని గురువారం బీఆర్‌ఎస్ నాయకులు పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓడపల్లి వెంకటేష్, ఆల్డా డైరెక్టర్ దశరథ గుప్తా, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లయ్య, మల్లేష్, లింగస్వామి, అనిల్, ఉప్పలయ్య, మొగులయ్య పాల్గొన్నారు.

మండలంలోని మరిపడిగ గ్రామంలో ఇటీవల మృతి చెందిన సజ్జనం సోమయ్య కుటుంబానికి రూ.10 వేలు, ఇందిరాల బాలచందర్ కుటుంబానికి రూ.5 వేల చొప్పున ఆర్థికసాయాన్ని గురువారం బీఆర్‌ఎస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తాండ్ర అమరావతి, ఉప సర్పంచ్ శ్రీనివాస్, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు దుడుక ఉప్పలయ్య, మాజీ ఎంపీటీసీ సింగారం ఉప్పలయ్య, చంద్రశేఖర్, రాంమల్లు, రాఘవులు, నాగరాజు పాల్గొన్నారు.

రాజాపేట : మండలంలోని పాముకుంట గ్రామానికి చెందిన పాల సంఘం డైరెక్టర్ డెడ్డబోయిన జహంగీర్ ఇటీవల మృతి చెందాడు. గురువారం నార్మూల్ మదర్‌డెయిరీ, పాల సంఘం తరఫున రూ. 5వేల చొప్పున ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో చిల్లింగ్ సెంటర్ మేనేజర్ అంబాల రవీందర్, పాల సంఘం చైర్మన్ రాపోలు అంజిరెడ్డి, డైరెక్టర్లు చిగుళ్ల రాములు, గడ్డం కుమార్, గుంటి స్వామి, కర్ణాకర్, చంద్రమ్మ, చిగుళ్ల బాలయయ, రాపోలు సంపత్, నీలం అశోక్, సూపర్‌వైజర్ రాములు, రమేష్, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

భువనగిరి : కంటివెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ తంగళ్లపల్లి శ్రీవాణిరవికుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని 35వ వార్డు పరిధిలో గల ఆర్‌బీనగర్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హరిబాబు, శ్రీను, రమేష్, స్వామి, క్యాంపు కోఆర్డినేటర్ బషీరుద్దీన్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ దుర్గం స్వప్న నరేశ్‌యాదవ్ అన్నారు. మండలంలోని దేశ్‌ముఖి గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చిల్లర జంగయ్య, ఉపసర్పంచ్ దుర్గం మాధురి మశ్చేందర్, గుండాల రాజారాం, వార్డుసభ్యులు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

జనగాంలో..

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని జనగాం గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ కురిమిద్దె కళమ్మ గురువారం ప్రారంభించారు. కంటివెలుగు శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వంగూరి శ్రీశైలం, శనిగల భార్గవి, మంజుల, వైద్యుడు సంపత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి పాండు, తిరుమల్లేష్, పుష్పలత, లోడే యాదయ్య పాల్గొన్నారు.

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని 19వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని విజయవంతంగా పూర్తిగా చేసిన వైద్య సిబ్బందిని గురువారం పలువురు నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో వైద్యులు రాజశేఖర్, పద్మ, స్వామి, ప్రణతి, వరకుమారి, తదితరులు ఉన్నారు.



భువనగిరి : ఆర్‌బీనగర్‌లో కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న కౌన్సిలర్ శ్రీవాణి



భూదాన్‌పోచంపల్లి : కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ దుర్గం స్వప్న నరేశ్



సంస్థాన్‌నారాయణపురం : జనగాంలో..

ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

భూదాన్‌పోచంపల్లి : ప్రతిఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని బోధిధర్మ యోగా అండ్ హెల్త్ అసోసియేషన్ అధ్యక్షుడు సీత భాస్కర్, యోగా శిక్షకురాలు కొయ్యడ సంధ్య అన్నారు. పట్టణ కేంద్రంలో గురువారం బోధిధర్మ యోగా అండ్ హెల్త్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని మెడిక్విస్ట్ డయాగ్నోస్టిక్ సెంటర్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు చంద్రశేఖర్, దిలీప్‌కుమార్, నరేందర్, వర్షిణి, ఉస్మాన్, బోధిధర్మ యోగా అసోషియేషన్ ప్రతినిధులు చింతకింది కిరణ్, కేమ విష్ణుమూర్తి, మల్లేశ్, చింతల రామకృష్ణ, రత్నం, రామనాథం, కొయ్యడ లింగస్వామి, చంద్రశేఖర్, సైకిలాబ్, తడక రజని, వంగూరి స్వాతి పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

యాదగిరిగుట్ట రూరల్: విత్తనాలు, ఎరువులు తీసుకునే సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని దళారులను నమ్మి మోసపోవద్దని మండల వ్యవసాయాధికారి రాజేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లైసెన్స్ కల్గిన ఫర్టిలైజర్ దుకాణాల్లో మాత్రమే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలన్నారు.

నల్లమాసు బాలరాజుకు నివాళి

భువనగిరి : మండలంలోని బండసోమారం గ్రామానికి చెందిన బీజేపీ మండల కమిటీ ఉపాధ్యక్షుడు నల్లమాసు బాలరాజ్ గురువారం మృతి చెందాడు. బాలరాజ్ మృతదేహాన్ని బీజేపీ రాష్ట్ర నాయడు గూడూరు నారాయణరెడ్డి సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు శేఖర్, కార్యదర్శి మాటూరి అనిల్, ఆంజనేయులు, చారి, సర్పంచ్ పద్మ, మాజీ సర్పంచ్ మాదవి, శరత్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శేఖర్ కుటుంబానికి అండగా నిలుస్తాం : ఎమ్మెల్యే

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని సర్వేల్ గ్రామంలో మొబైల్ రేడియేషన్‌తో మృతి చెందిన శేఖర్ కుంటుంబాన్ని శేఖర్ కుంటుంబానికి అండగా నిలుస్తామని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మర్రిగూడ గ్రామంలో జరిగిన శేఖర్ అంత్యక్రియల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం మృతుడి కుటుంబానికి రూ.లక్ష గాయపడిన వెంకటేష్, ప్రణయ్‌కు రూ.10వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు.

పలువురు నాయకులు శేఖర్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అనుచరులు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చలమల్ల కృష్ణారెడ్డి, తెలంగాణ రాష్ట్ర లారీ యజమానుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నందారెడ్డిలు ఆర్థికసాయం చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రజా సంపదను దుర్వినియోగం చేస్తున్న ప్రభుత్వాలు

సంస్థాన్ నారాయణపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంపదను దుర్వినియోగం చేస్తున్నాయని సీపీఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్.జనార్ధన్ అన్నారు. గురువారం మండలంలోని వావిళ్లపల్లి గ్రామంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఘనంగా నక్సల్బరీ ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ గ్రామ కార్యదర్శి దోటి భిక్షం జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో గుదే అచ్చయ్య, మానుపాటి యాదయ్య, కొర్ర రామదాసు, గుదే రవీందర్, శ్రీశైలం తదితరులున్నారు.

శ్రమకు తగిన వేతనం ఇవ్వాలి

బొమ్మలరామారం : శ్రమకు తగిన వేతనం ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు అన్నెమైన వెంకటేష్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్మికులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. లి అసంఘటిత రంగంలోని భవన నిర్మాణ కార్మికులకు ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో భిక్షపతి, యాదయ్య, కవిత, భారతమ్మ పాల్గొన్నారు.

సమావేశాన్ని జయప్రదం చేయాలి

చౌటుప్పల్ : వచ్చే నెల 1న భువనగిరిలో నిర్వహించనున్న పద్మశాలీ సంఘం జిల్లా సర్వసభ్య సమావేశాన్ని విజయవంతం చేయాలని పద్మశాలీ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిరందాసు ధనుంజయ అన్నారు. స్థానిక మార్కండేయస్వామి దేవాలయంలో గురువారం జరిగిన పద్మశాలీ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో చేనేత సంఘాల అసోసియేషన్ జిల్లా చైర్మన్ కందగట్ల భిక్షపతి, చేనేత నాయకులు గోశిక స్వామి, అంకెం పాండు, గంజి జనార్ధన్, నర్సింహ, గోశిక నర్సింహ, పాండురంగం, గోశిక పురుషోత్తం, సురేఖ, బడుగు సావిత్రి, మురళీధర్, చలపతి, జయప్రకాష్, రవి, జనార్ధన్, రమేష్, వెంకటేశం పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి పండుగ

తుర్కపల్లి: మండలంలోని దత్తాయపల్లి గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు కొనసాగుతున్నాయి. గురువారం జరిగిన వేడుకల్లో కాంగ్రెస్ అధికార ప్రతినిధి బోరెడ్డి అయోధ్యరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కుడుదుల నగేశ్, కల్లూరి రామచంద్రరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గిద్దె కరుణాకర్, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

యుగేంధర్‌పై దాడిని ఖండించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేడి ప్రియదర్శిని


రామన్నపేట: అడ్వకేట్ యుగేంధర్‌పై దాడిని ప్రతిఒక్కరూ ఖండించాలని బీఎస్పీ నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేడి ప్రియదర్శిని అన్నారు. గురువారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడారు. తుంగతుర్తి ఎమ్మెల్యే చేసే ఇసుక, లాండ్ మాఫియా, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, దళిత బంధులో జరుగుతున్న అవినీతిపై ప్రశ్నిస్తే దాడులు చేయించడం తగదన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. యుగేంధర్‌పై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలన్నారు. సమావేశంలో ఆ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు గద్దపాటి రమేష్, ఉపాధ్యక్షుడు పావిరాల నర్సింహ, మండల అధ్యక్షుడు మేడి సంతోష్, ఉపాధ్యక్షుడు గుని రాజు, ప్రధానకార్యదర్శి నకిరేకంటి నర్సింహ, శేఖర్, సత్తయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా పోలీస్‌స్టేషన్ పాత భవనం

తుర్కపల్లి: పట్టణంలోని పోలీస్ స్టేషన్ పాత భవనం నిరుపయోగంగా ఉంది. మండల కేంద్రంలో 1989లో అప్పటి హోం మంత్రి ఎలిమినేటి మాధవరెడ్డి పోలీస్ స్టేషన్ భవనానికి శంకుస్థాపన చేశారు. 1993లో భవనాన్ని ప్రారంభించారు. సుమారు 30 సంవత్సరాల పాటు ఈ భవనంలో పోలీస్ స్టేషన్ కొనసాగింది. గతేడాది మండల పోలీస్ స్టేషన్‌ను రోడ్డు వెంబడి నిర్మించిన నూతన భవనంలోకి మార్చడంతో పాతభవనం ఖాళీగా ఉంది.

విశ్రాంతి భవనం కూడా..


నక్సలైట్ల ప్రభావం ఎక్కువగా ఉన్నప్పుడు వివిధ బలగాల కోసం విశ్రాంతి భవనం కూడా నిర్మించారు. ఈ విశ్రాంతి భవనం కూడా ఇప్పుడు నిరుపయోగంగా నే ఉంటుంది. పోలీస్ స్టేషన్ పక్కనే క్వాటర్స్ ఉండడంతో పోలీసులకు డ్యూటీలు నిర్వహించడం సులభతరంగా ఉండేది. ప్రస్తుతం పోలీస్ స్టేషన్ ఓ చోట క్వాటర్ మరో చోట ఉండడంతో పోలీస్ సిబ్బంది కూడా ఇబ్బందులు పడుతున్నారు. పాత పోలీస్ స్టేషన్, విశ్రాంతి భవనాలు వాడుకలో లేకపోవడంతో ఈ భవనం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. పోలీస్ స్టేషన్ పాత భవనానికి మరమ్మతులు చేపట్టి భవనాలను ఇతర కార్యాలయాలకు వినియోగించాలని స్థానికులు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న పోలీస్ స్టేషన్ పాత భవనం

భవనాన్ని వినియోగించుకోవాలి


మండల ప్రజల అవసరాల కోసం పోలీస్ స్టేషన్ భవనం రోడ్డు మీదికి మార్చారు. పాత పోలీస్ స్టేషన్ భవనం నిర్మించి 30 ఏండ్లే అవుతుంది. నేటికి భవనం చెక్కు చెదరకుండా ఉంది. పాత భవనాన్ని పోలీస్ శాఖ లేదా ఇతర శాఖలకు వినియోగించుకోవాలని కోరుతున్నాం.



–కొక్కొండ లక్ష్మీనారాయణ, బీజేపీ మండల అధ్యక్షుడు

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం


పోలీస్ స్టేషన్ పాత భవనాన్ని పాత భవనంలో సీఐ ఆఫీస్ గానీ పోలీస్‌ల గెస్ట్ హౌజ్‌కు గానీ ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్ గొంగిడి సునీతమహేందర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాం. త్వరలో ఈ భవనాన్ని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చొరవ తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



–పిన్నపురెడ్డి నరేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు

ఇతర శాఖలకు సర్దుబాటు చేయాలి

పోలీస్ స్టేషన్ పాత భవనాన్ని నిర్మించి కేవలం 30 సంవత్సరాలే అవుతుంది. భవనం నిరుపయోగంగా ఉండడంతో శిథిలావస్థకు చేరే అవకాశం ఉంది. భవనాన్ని పోలీస్ శాఖకు, ఇతర శాఖల కార్యాలయాలకు సర్దుబాటు చేసి వినయోగంలోకి తీసుకురావాలని కోరుతున్నాం.



–ఐనాల చైతన్యమహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మహిళా విభాగం అధ్యక్షురాలు